
ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
గురువారం, 10 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 26 | పేజీలు: 4 వెల: 5

# బీజేపీ ఖాతాలో రూ.1,473 కోట్లు

- కాంగ్రెస్‌తో పోలిస్తే 7 రెట్లు అధికంగా విరాళాలు
- ఐదు రాష్ట్రాల ఎన్నికల వేళ భారీగా పెరిగిన బీజేపీ నిధులు
- కాంగ్రెస్ ఖాతాలో మాత్రం నిధుల క్షీణత
- బీజేపీ, కాంగ్రెస్ ఈసీకి సమర్పించిన నివేదికల్లో వెల్లడి

**న్యూఢిల్లీ :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీకి భారీగా విరాళాలు వచ్చాయి. కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీకి వచ్చిన నిధుల్లో భారీ వ్యత్యాసం కనిపించింది. బీజేపీ కేంద్ర కార్యాలయానికి మాత్రమే రూ.1,472.8 కోట్లు ఆదాయం రాగా, కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర విభాగాలన్నింటినీ కలిపి రూ.207 కోట్ల ఆదాయం మాత్రమే నమోదైంది. అంటే బీజేపీకి వచ్చిన నిధులు కాంగ్రెస్ కంటే దాదాపు 7 రెట్లు అధికంగా ఉన్నాయి. ఇరు పార్టీలు ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మార్చి 15 నుంచి మే 6 వరకు బీజేపీ కేంద్ర కార్యాలయానికి రూ.1,472.8 కోట్లు ఆదాయం వచ్చినట్లు నివేదికలో పేర్కొంది. ఎన్నికల ప్రారంభంలో బీజేపీ కేంద్ర కార్యాలయ ఖాతాల్లో రూ.6,722.6 కోట్లు ఉండగా, మే 6 నాటికి రూ.7,627.2 కోట్లకు చేరింది. ఎన్నికల కాలంలో రూ.904.6 కోట్ల పెరుగుదల నమోదైంది. కేరళ, బంగాల్ ఎన్నికల ఖర్చుల నివేదికలు ఇంకా బహిర్గతం కాలేదు.



**కాంగ్రెస్ నిధుల్లో క్షీణత**

ఎన్నికల ప్రారంభంలో కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర విభాగాల వద్ద కలిపి రూ.169.06 కోట్లు ఉన్నాయి. ఇందులో రూ.22.9 కోట్లు నగదు, రూ.146.1 కోట్లు బ్యాంకు ఖాతాల్లో ఉన్నాయి. ఎన్నికలు ముగిసే సమయానికి ఈ మొత్తం రూ.103.2 కోట్లకు తగ్గింది. అంటే రూ.65.86 కోట్ల క్షీణత నమోదైంది. బహిర్గతమైన వివరాల ప్రకారం అసోం, తమిళనాడు, పుదుచ్చేరిలో బీజేపీ రూ.159.7 కోట్లు ఖర్చు చేసింది. అసోంలో రూ.96.27 కోట్లు, తమిళనాడులో రూ.51.56 కోట్లు, పుదుచ్చేరిలో రూ.11.90 కోట్లు వెచ్చించింది. అసోంలో సాధారణ ప్రచారానికి రూ.76.73 కోట్లు, అభ్యర్థుల కోసం రూ.19.54 కోట్లు ఖర్చు చేసింది.

**కాంగ్రెస్ వ్యయం రూ.248.55 కోట్లు**

ఐదు రాష్ట్రాల్లో కాంగ్రెస్ మొత్తం రూ.248.55 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో రూ.143 కోట్లు సాధారణ ప్రచారానికి, రూ.105.55 కోట్లు అభ్యర్థుల కోసం వెచ్చించింది. కేంద్ర కార్యాలయం రూ.40.52 కోట్లు, రాష్ట్ర, స్థానిక విభాగాలు రూ.102.49 కోట్లు సాధారణ ప్రచారానికి ఖర్చు చేశాయి. కేరళలో రూ.59.28 కోట్లు, అసోంలో రూ.22.62 కోట్ల వ్యయం నమోదైంది.



# ఆరు రోజుల సభ.. 3 రోజులు రభసే



## ప్రజాధనంతో సభ.. ప్రయోజనం ఎక్కడ?

అజెండా పక్కకు.. ఆరోపణలు, ప్రత్యారోపణలు ముందుకు

రైతులు, విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలపై చర్చ ఏది?

రోజుకు రూ.8–12 లక్షల ఖర్చు.. ప్రజలకు మిగిలిందేమిటి?

మిగిలిన 3 రోజులైనా సద్వినియోగం జరిగేనా..?

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు కొలువుదీరిన తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు అనుకున్న దారిలో సాగడం లేదు. ప్రభుత్వం ముందుగానే 6 రోజుల పాటు సభ నిర్వహించాలని ప్రణాళిక రూపొందించింది. గురువారం, శుక్రవారం, శనివారంతో సమావేశాలు ముగియనున్నాయి. కీలక బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించుకోవడంతో పాటు, వెయ్యి రోజుల పాలనపై ప్రత్యేక చర్చ నిర్వహించి ప్రభుత్వం చేసిన మేళ్లను వివరించాలని అధికార పక్షం నిర్ణయించింది. మరోవైపు ఇందిరమ్మ ఇళ్లు, హైడ్రా కమిషనర్ వ్యవహారం, రైతుల ఇబ్బందులు, ఎల్‌నినో ప్రభావం వంటి ప్రజా సమస్యలను లేవనెత్తాలని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సిద్ధమైంది. కానీ సభ ప్రారంభమైన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అజెండాలో ఉన్న అంశాలపై లోతైన చర్చ జరగకుండానే అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలకే సభా సమయం పరిమితమవుతోంది.

**మొదటి రోజే మారిన సభ ముఖచిత్రం**

సోమవారం తొలిరోజే బీఆర్ఎస్ సభ్యులు వెయ్యి రోజుల పాలనలో ఏమీ జరగలేదంటూ నల్ల టీషర్టులు ధరించి నిరసన తెలిపారు. అదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు సభను కుదిపేశాయి. రెండో రోజుకూ పరిస్థితి సద్దుమణగలేదు. ఎమ్మెల్సీల వ్యవహారంపై అధికార, ప్రతిపక్ష సభ్యుల

........(తరువాయి 2లో)

# సీట్లకు అంటుకుపోయారు!

- రెవెన్యూ విభాగంలో పాతుకుపోయిన ఆర్ఐలు
- బదిలీ నిబంధనలు నీటి మూటలేనా?
- 6 ఏళ్లుగా ఒకే స్థానంలో సురేష్
- కేసులు పెండింగ్ లో ఉన్నా చలామణి అవుతున్న మరికొందరు
- డిప్యూటేషన్ అర్ఐ వ్యవహారంపై అనుమానాలు
- కమిషనర్ వెంకన్న సార్ జోక్యం చేసుకుంటారా?



ఆరేళ్లుగా ఒకే సీటు.. మూడేళ్ల బదిలీ నిబంధనకు దిక్కులేదు! గ్రేటర్ వరంగల్ బల్దియా రెవెన్యూ విభాగంలో కొందరు ఆర్ఐలు ఏళ్ల తరబడి అదే స్థానాల్లో పాతుకుపోయారు. ఒకరిపై డిసిప్లినరీ కేసు, మరొకరిపై క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నా కీలక బాధ్యతల్లో కొనసాగుతున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు సొంత కార్పొరేషన్‌లో అర్హులైన సిబ్బంది ఉండగానే మహబూబాబాద్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఆర్ఐకి కీలక పోస్టు కట్టబెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇదే సమయంలో ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారనే ఆరోపణలపై కమిషనర్ టి. వెంకన్న స్వయంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మరి ఏళ్లుగా ఒకే సీటుకు అంటుకుపోయిన ఆర్ఐలపై కమిషనర్ ప్రక్షాళన చేపడతారా? *-కాకతీయ,వరంగల్ ప్రతినిధి*

4

# ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్లు!

- నర్సంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అడ్డగోలు వ్యవహారం?
- 2 మండలాల్లో పంచాయతీ కార్యదర్శుల సంతకాలు ఫోర్జరీ, నకిలీ స్టాంపులు?
- ఇళ్లు, భూములు రిజిస్ట్రేషన్.. ఆపై రుణాలు
- కార్యాలయంలో పెరిగిన రైటర్ల పెత్తనం
- డీఆర్ విచారణకు ఆదేశించేనా..? ఆడిట్ జరిగేనా..?!!



4



# విద్వేషం, విధ్వంస విధానాలతో కాంగ్రెస్ పాలన

- వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే డైవర్షన్ పాలిటిక్స్
- ప్రజల సమస్యలు, హామీల అమలుపై సమాధానం చెప్పాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

2

# తెలంగాణకు నాలుగో రైల్వే లైన్

- ఘట్‌కేసర్–కాజీపేట మధ్య రూ.2,419 కోట్లతో నిర్మాణం
- 110 కి.మీ. అదనపు లైన్‌తో హైదరాబాద్–వరంగల్ మధ్య తగ్గనున్న రద్దీ
- ప్రయాణికులు, సరకు రవాణాకు మరింత వెసులుబాటు
- యాదాద్రి, భువనగిరి, వరంగల్‌కు మెరుగైన అనుసంధానం
- దక్షిణాదిలో 5 మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ రైల్వే మౌలిక వసతుల విస్తరణకు కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో దేశవ్యాప్తంగా 8 మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. మొత్తం రూ.20,804 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనులను 2029-30 నాటికి పూర్తి చేయాలని

........(తరువాయి 2లో)

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోనే కుట్ర



- ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదు
- కుట్రధారులు, పాత్రధారులందరిపై కఠిన చర్యలు
- అంటరానితనంపై విజయ్‌కుమార్‌తో విచారణ
- మహిళలను ఇబ్బంది పెట్టిన ఘటనపైనా దర్యాప్తు
- నేలను కాదు.. అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలి
- బీఆర్ఎస్ నేతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** ఉగ్రవాదులకు, స్పీకర్‌ను తిట్టిన వారికి తేడా లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. కులవివక్ష, అణచివేత చర్యలను తమ ప్రభుత్వం ఎంతమాత్రం ఉపేక్షించదని హెచ్చరించారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన భేటీ నుంచే కుట్రకు బీజం పడిందని ఆరోపించారు. ఫామ్‌హౌస్ భేటీ మొదలుకుని ఆ తర్వాత చోటుచేసుకున్న వరుస ఘటనలపై సమగ్ర విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. కుట్ర చేసినవారిని, దానిని అమలు చేసినవారిని గుర్తించి కోర్టు ముందు దోషులుగా నిలబెడతామని చెప్పారు. అంటరానితనం ప్రదర్శించిన వారిపై విచారణకు ఆదేశిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ఘటనపై హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను విచారణాధికారిగా నియమిస్తున్నట్లు వెల్లడించారు. ఎక్కడో ఉండి సూచనలు చేసిన వారితో పాటు వాటిని అమలు చేసిన వారిపైనా చర్యలు

........(తరువాయి 2లో)

# భక్తులకు టీటీడీ బీమా కవచం

- భక్తులందరికీ ఉచితంగా బీమా సౌకర్యం
- తిరుమలలో సహజ మరణానికీ రూ.2 లక్షల సాయం
- ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు
- సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు
- టీటీడీ పాలకమండలి చారిత్రాత్మక నిర్ణయం

2

# ఏసీబీ వలలో సంగారెడ్డి డీఐఈవో



- కాలేజీ అఫిలియేషన్ కోసం లంచం డిమాండ్
- ఇప్పటికే రూ.30 వేలు స్వీకరణ.. మరో రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టివేత
- డీఐఈవో రామావత్ గోవింద్‌రామ్ అరెస్టుతో విద్యాశాఖలో కలకలం

2

# ఆరు రోజుల సభ.. మూడు రోజులు రభసే

(మొదటిపేజీ తరువాయి)
మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. మూడో రోజూ అదే పరిస్థితి కొనసాగింది. తమపై భౌతిక దాడి జరిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపిస్తే, తామే అవమానానికి, దాడులకు గురయ్యామని బీఆర్ఎస్ నేతలు ప్రత్యారోపణలు చేశారు. దీంతో సభ నినాదాలు, గందరగోళంతో రణరంగాన్ని తలపించింది. ఫలితంగా ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం లేకుండా పోయింది.



**రైతుల కష్టాలపై చర్చ ఏది?**
ప్రస్తుతం రాష్ట్ర రైతులు ఎల్‌నినో ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితులు, సాగునీటి సమస్యలు, ఎరువుల కొరత వంటి అంశాలపై రైతుల్లో ఆందోళన ఉంది. మరోవైపు హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై డీజీపీ ఆనంద్ స్వయంగా వ్యాఖ్యానించిన పరిస్థితి ఉంది. ఇలాంటి కీలక అంశాలపై అసెంబ్లీలో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉంది. కానీ సభలో మాత్రం రాజకీయ విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలే ప్రధానంగా మారాయి. విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగులు పీఆర్సీ, డీఏ కోసం ఆశగా చూస్తున్నారు. యువతకు ఉపాధి, నిరుద్యోగ సమస్యలపై స్పష్టమైన చర్చ అవసరం. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలను శాసనసభ వేదికగా ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి చర్చించాల్సిన అవసరం ఉంది. కానీ ఆ దిశగా చర్చ జరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**ప్రజాధనం ఖర్చవుతోంది.. చర్చ మాత్రం లేదు**
శాసనసభ నిర్వహణకు రోజుకు సుమారు రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ప్రజాధనం ఖర్చవుతోంది. ఇంత భారీ మొత్తంతో సభ కొనసాగుతున్నప్పుడు ప్రజల సమస్యలపై సమర్థవంతమైన చర్చ జరగాల్సి ఉంది. ప్రజల పన్నులతో నడిచే సభలో రోజంతా నినాదాలు, వాగ్వాదాలు, ఆరోపణలతోనే సమయం గడిచిపోతే దాని ప్రయోజనం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. సభ ముగిసిన తర్వాత ప్రతి నాయకుడు తన రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమవుతారు. మరి సామాన్యుల సమస్యలపై చర్చించేది ఎప్పుడు అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. ప్రజాస్వామ్య దేవాలయంగా భావించే శాసనసభను కేవలం రాజకీయ కక్షలు తీర్చుకునే వేదికగా మార్చడం సరికాదు. అధికార పక్షం, ప్రతిపక్షం కలిసి కూర్చొని రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలపై చర్చించాల్సిన సమయంలో బూతులు, విమర్శలు, వ్యక్తిగత ఆరోపణలకే ప్రాధాన్యం దక్కుతోంది. సోషల్ మీడియాలో ఏ అంశం ట్రెండ్ అవుతుందనే దానిపై నేతలు దృష్టి పెట్టడం కంటే, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రతి ఇంట్లో, ప్రతి గడపలో వినిపిస్తున్న సమస్యలు అసెంబ్లీ గడప దాటకపోవడం విచారకరం. ప్రజలు తమ సమస్యలను తమ ప్రతినిధుల ద్వారా సభలో ప్రస్తావిస్తారని ఆశిస్తారు. కానీ సభలో జరుగుతున్న పరిణామాలను చూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా మారకూడదు.

**మిగిలిన 3 రోజులైనా సార్థకం చేయాలి**
ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ పంతాలను పక్కనపెట్టి ప్రజాధనాన్ని, సభా సమయాన్ని గౌరవించాల్సిన అవసరం ఉంది. మిగిలిన 3 రోజుల్లోనైనా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర చర్చ జరగాలి. ప్రభుత్వం తన విధానాలను వివరించడంతో పాటు ప్రతిపక్షం నిర్మాణాత్మక సూచనలు చేయాలి. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకునేలా సభను సద్వినియోగం చేసుకోవాలి. లేకపోతే ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ రభసకే సభను పరిమితం చేశారనే విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులందరిపైనా అసెంబ్లీ పవిత్రతను కాపాడి, ప్రజా సమస్యల పరిష్కారాన్ని పరమావధిగా చేసుకోవాల్సిన బాధ్యత ఉంది.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోనే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)
తీసుకుంటామని చెప్పారు. కుట్రధారులు, పాత్రధారులందరినీ శిక్షించేలా విచారణ కొనసాగుతుందని, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసెంబ్లీ వద్ద అంగప్రదర్శన చేసి మహిళలను ఇబ్బందిపెట్టిన ఘటనపైనా విచారణ చేపడుతున్నామని తెలిపారు. విధుల్లో ఉన్న ఉద్యోగులు, పోలీసులపై జరిగిన దాడుల వివరాలను కూడా సేకరిస్తామని చెప్పారు. ఫామ్‌హౌస్‌లో భేటీ మొదలుకుని వరుసగా జరిగిన ప్రతి ఘటనపైనా విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు.



**తల్లిని అవమానిస్తారా?**
కేసీఆర్ ఫామ్‌హౌస్ రోడ్డును శుద్ధి చేయడంపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలతో సమావేశమైన విపక్షనేత కేసీఆర్ చేసిన కుట్ర ఇదేనా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ముందు విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులను ఇబ్బందిపెట్టారని, దళితుడైన సభాపతిని ఘోరమైన పదంతో దూషించారని ఆరోపించారు. రాజకీయంగా ఎన్ని విభేదాలైనా ఉండవచ్చని, కానీ తల్లిని అవమానిస్తారా అని రేవంత్‌రెడ్డి నిలదీశారు. స్పీకర్‌కు క్షమాపణలు చెప్పి తప్పును సరిదిద్దుకోవాలని అన్ని పార్టీలు సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. దళిత సభాపతిని అవమానించిన ఘటనతో అందరి మనోభావాలు దెబ్బతిన్నాయని సీఎం అన్నారు. స్పీకర్‌ను దూషించడాన్ని ఖండిస్తూ ఎస్సీ ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని పేర్కొన్నారు. ఎక్కడ కుట్ర జరిగిందో అక్కడే డప్పు మోగించి నిరసన తెలిపారని, ఫామ్‌హౌస్‌కు చాలా దూరంలో డప్పులు కొట్టారే తప్ప ఎవరినీ తిట్టలేదని, దాడి చేయలేదని స్పష్టం చేశారు. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే వారు కోరారని అన్నారు. అయితే కేసీఆర్ క్షమాపణలు చెప్పకుండా మరో కుట్రకు ఆదేశించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ ఆదేశాల మేరకే శుద్ధి చేశామని బీఆర్ఎస్ నేత సంధ్యారావు పోస్టు చేశారని తెలిపారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న, విజ్ఞత కలిగిన నాయకుడు ఇలా చేస్తారా అని ప్రశ్నించారు.

**నేలను కాదు.. ఆలోచనలను శుద్ధి చేయాలి**
శుద్ధి చేయాల్సింది నేలను కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాలని రేవంత్‌రెడ్డి హితవు పలికారు. తరతరాలుగా మనసుల్లో పేరుకుపోయిన కుళ్లు, అంతరాలను శుద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దళితులు నడిచారని నేలను శుద్ధి చేయించిన దొర అహంకారాన్ని శుద్ధి చేయాలని పేర్కొన్నారు. దళితులను అవమానించిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే, గడ్డం ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి మాత్రమే కాదని అన్నారు. అవి కులవివక్ష, అణచివేతకు సంబంధించిన చర్యలని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ప్రజా ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఏసీబీ వలలో సంగారెడ్డి డీఐఈవో

- కాలేజీ అఫిలియేషన్ కోసం లంచం డిమాండ్
- ఇప్పటికే రూ.30 వేలు స్వీకరణ.. మరో రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టివేత
- డీఐఈవో రామావత్ గోవింద్‌రామ్ అరెస్టుతో విద్యాశాఖలో కలకలం



**కాకతీయ, సంగారెడ్డి :** వికాస్ వొకేషనల్ జూనియర్ కాలేజీ ప్రొవిజనల్ అఫిలియేషన్ పునరుద్ధరణకు తనిఖీ చేసి నివేదిక సమర్పించేందుకు రూ.50 వేలు లంచం డిమాండ్ చేసి, ఇప్పటికే రూ.30 వేలు తీసుకుని, మరో రూ.20 వేలు స్వీకరిస్తూ సంగారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రామావత్ గోవింద్‌రామ్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. బుధవారం మధ్యాహ్నం 1.20 గంటల సమయంలో సంగారెడ్డిలోని డీఐఈవో కార్యాలయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారిక విధులను నిజాయితీగా నిర్వహించకుండా అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా వెల్లడించలేదు. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

# ఆకలికి అన్నం పెట్టిన కేదారి

- ఉద్యమకారులకు అండగా నిలిచిన సేవామూర్తి
- 'ఫుడ్ వేస్ట్ చేయొద్దు' అంటూ అవగాహన
- మోదీతో మన్‌కీ బాత్‌లో ముచ్చట
- అగ్నిప్రమాదంలో ఆపన్నహస్తం దూరం

**కాకతీయ, హన్మకొండ :** హనుమకొండ అదాలత్ జంక్షన్‌లోని లింగాల కేదారి హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదం ఓరుగల్లు ప్రజలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. హోటల్ యజమాని లింగాల కేదారి మృతి చెందగా.. ఆయన భార్య పుష్పలత తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం ఓ కుటుంబానికే కాదు.. ఏళ్లుగా ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టిన ఓ ఆపన్నహస్తాన్ని దూరం చేసింది. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగిన రోజుల్లో అదాలత్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వద్దకు వచ్చే విద్యార్థులు, ఉద్యమకారులకు కేదారి దంపతులు ఉచితంగా టీ, టిఫిన్, భోజనం అందించేవారు. ఉద్యమకారుల కష్టాలను తన కష్టాలుగా భావించి ఆహారం పెట్టడాన్ని సేవగా భావించారు. లాభాల కంటే మానవీయతకే ప్రాధాన్యమిస్తూ హోటల్ నిర్వహించారు. ఉద్యమం ముగిసిన తర్వాత కూడా అదే సేవా దృక్పథాన్ని కొనసాగించారు.



లింగాల కేదారి,పుష్పలత దంపతులు (ఫైల్‌ఫొటో)

**మోదీతో మన్‌కీ బాత్**
కేదారి సేవలకు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు వచ్చింది. సుమారు 2 ఏళ్ల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా కేదారితో మాట్లాడారు. సాధారణ హోటల్ నిర్వహిస్తూ సామాజిక సేవకు ప్రాధాన్యమిచ్చిన ఆయన ప్రధానమంత్రితో మాట్లాడే స్థాయిలో గుర్తింపు పొందారు. అయితే ఆ గుర్తింపును వ్యక్తిగత ప్రచారం కోసం కాకుండా మరింత సేవ చేయడానికి ఉపయోగించుకున్నారు. బుధవారం హోటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కేదారి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, సిబ్బంది అక్కడికి చేరుకుని వారిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే కేదారి మృతి చెందారు. భార్య పుష్పలత పరిస్థితి విషమంగా ఉంది. ఎన్నో ఆకలికడుపులు నింపిన చేతులు అగ్నికి ఆహుతి కావడం ఓరుగల్లు ప్రజలను కలచివేస్తోంది. కేదారి సేవా జ్ఞాపకాలు మాత్రం ఆయనను చూసిన ప్రతి ఒక్కరి మనసులో నిలిచిపోనున్నాయి.

**ఆహారం విలువ చెప్పిన మనసు**
ఫుడ్ వేస్ట్ చేయొద్దు అనే సందేశాన్ని వరంగల్ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కేదారి ప్రత్యేకంగా కృషి చేశారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడంతో పాటు.. అందుబాటులో ఉన్న ఆహారాన్ని వృథా చేయకూడదని అవగాహన కల్పించారు. అవసరమైన వారికి చేయూతనిస్తూ హోటల్‌ను వ్యాపార కేంద్రంగా కాకుండా సేవా వేదికగా మార్చారు. భార్యాభర్తలిద్దరూ స్వయంగా హోటల్‌లో పనిచేస్తూ సామాజిక సేవను కొనసాగించారు.

# తెలంగాణకు నాలుగో రైల్వే లైన్

(మొదటిపేజీ తరువాయి)
కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో తెలంగాణకు అత్యంత కీలకమైన ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.2,419 కోట్లు కేటాయించనున్నారు. ఘట్‌కేసర్ నుంచి కాజీపేట వరకు నాలుగో లైన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్-వరంగల్ మార్గంలో రైళ్ల రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు అధికంగా ఉండటంతో కొత్త ప్రయాణికుల రైళ్లను ప్రవేశపెట్టడం, సరకు రవాణాను పెంచడంలో పరిమితులు ఉన్నాయి. అదనపు ట్రాక్ నిర్మాణంతో రైళ్ల రాకపోకలకు మరింత వెసులుబాటు కలగనుంది. ప్రయాణికుల రైళ్లతో పాటు సరకు రైళ్లను సమర్థంగా నడిపేందుకు అవకాశం ఏర్పడుతుంది.

**యాదాద్రి నుంచి కాజీపేట వరకు కీలక అనుసంధానం**
ఘట్‌కేసర్-కాజీపేట మార్గం హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, వరంగల్, కాజీపేట ప్రాంతాలను కలిపే కీలక రైల్వే మార్గంగా ఉంది. నాలుగో లైన్ నిర్మాణంతో ఈ ప్రాంతాల మధ్య రైలు అనుసంధానం మరింత బలోపేతం కానుంది. యాదగిరిగుట్ట, భువనగిరి కోట వంటి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలకు రైలు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడే అవకాశం ఉంది. పారిశ్రామిక ప్రాంతాల నుంచి సరకు రవాణా కూడా వేగవంతం కానుంది. బొగ్గు, సిమెంట్, ఇనుము-ఉక్కు, ఆహార ధాన్యాలు, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తుల వంటి సరకు రవాణాకు ఈ మార్గం కీలకం. అదనపు ట్రాక్ అందుబాటులోకి వస్తే సరకు రైళ్లకు ప్రత్యేక మార్గం కల్పించే వెసులుబాటు పెరగనుంది. దీంతో రహదారి రవాణాపై ఒత్తిడి తగ్గడంతో పాటు లాజిస్టిక్స్ వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంది.

**దక్షిణాదిలో 5 ప్రాజెక్టులు**
తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో 5 మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి మొత్తం అంచనా వ్యయం రూ.10,021 కోట్లు. ఇందులో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల నాలుగో లైన్, అరక్కోణం-రేణిగుంట మధ్య 77 కిలోమీటర్ల మూడో, నాలుగో లైన్లు, వైట్‌ఫీల్డ్-బంగారపేట మధ్య 47 కిలోమీటర్ల మూడో, నాలుగో లైన్లు, హోసూరు-ఓమలూరు మధ్య 147 కిలోమీటర్ల డబ్లింగ్, సేలం-కరూర్-దిండిగల్ మధ్య 159 కిలోమీటర్ల డబ్లింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ 5 ప్రాజెక్టులు 4 రాష్ట్రాల్లోని 17 జిల్లాల మీదుగా సాగనున్నాయి. వీటి ద్వారా దక్షిణ భారతదేశంలో సుమారు 2,121 గ్రామాలకు రైల్వే అనుసంధానం మెరుగుపడనుంది. దాదాపు 52 లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం కలగనుంది.

**ఏటా 47 మిలియన్ టన్నుల అదనపు సామర్థ్యం**
ఈ ప్రాజెక్టులు పూర్తయితే దక్షిణ భారతదేశంలో ప్రయాణికుల రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు పారిశ్రామిక ప్రాంతాల నుంచి దేశంలోని ఇతర ప్రాంతాలకు సరకు తరలింపు వేగవంతం కానుంది. ఏటా సుమారు 47 మిలియన్ టన్నుల అదనపు సరకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కేంద్రం వెల్లడించింది. రైల్వే నెట్‌వర్క్ విస్తరణతో రోడ్డు రవాణాపై ఒత్తిడి తగ్గడం, సరకు రవాణా వేగం పెరగడం, లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఏర్పడనుంది.



## దళిత స్పీకర్‌ను అవమానిస్తే ఊరుకోం

- బీఆర్ఎస్ సభ్యుల తీరుపై భట్టి ఫైర్
- వెల్‌లోకి దూసుకొచ్చి వియ్ వాంట్ జస్టిస్ నినాదాలు
- సభ ముగిసేంత వరకు బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హెచ్చరిక

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో పాటు ఆయన తల్లిని ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, దళిత ప్రజాప్రతినిధులను అవమానించడం సహించేది లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతల దొరతనం పోకడలు, బలహీనవర్గాల పట్ల కుల వివక్షను తెలంగాణ భరించబోదని హెచ్చరించారు. తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు మూడో రోజు తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగాయి. సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి వియ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ పలుమార్లు హెచ్చరించినా సభ్యులు వెనక్కి తగ్గలేదు. దీంతో సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదన మేరకు బీఆర్ఎస్ సభ్యులను సమావేశాలు ముగిసేంత వరకు సస్పెండ్ చేశారు. అనంతరం సభ టీ బ్రేక్‌కు వెళ్లింది.

**మార్షల్స్ అడ్డుకోవడంతో ఉద్రిక్తత**
సస్పెన్షన్ అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకోవడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కేటీఆర్, హరీశ్ రావు, జగదీష్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, కొనికంటి మాణిక్ రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, కేపీ వివేకానంద తదితరులను సస్పెండ్ చేశారు.

**దొరతనం పోకడలు సహించం**
స్పీకర్‌తో పాటు ఆయన తల్లిని ఉద్దేశించి బీఆర్ఎస్ నేతలు చేసిన అసభ్యకర వ్యాఖ్యలను భట్టి విక్రమార్క ఖండించారు. కాంగ్రెస్ దళిత ప్రజాప్రతినిధులు రోడ్డుపై నిరసన తెలిపిన ప్రాంతాన్ని పేడ, పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అవమానకరమని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజాస్వామ్య పాలన నడుస్తోందని, దొరతనం పోకడలకు, బలహీనవర్గాలపై కుల వివక్షకు చోటు లేదన్నారు. సభాపతి ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తూ రాజ్యాంగ వ్యవస్థలను చులకన చేసేలా విపక్ష నేతలు వ్యవహరిస్తే ప్రభుత్వం ఊరుకోదని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

## తల్లి మృతిని తట్టుకోలేక కూతురు మృతి

- ముత్తారంలో హృదయ విదారక ఘటన
- ఒకే కుటుంబంలో వరుస విషాదాలు



**కాకతీయ,శంకరపట్నం :** మండలంలోని ముత్తారం గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బొంగోని విజయ (55) బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. తల్లి మరణవార్త విని తీవ్రంగా కలత చెందిన ఆమె కూతురు బొంగోని మంజుల (38) కూడా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగానే కూతురు బొంగోని మంజుల మృతి చెందడం కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కొద్దిసేపటి వ్యవధిలోనే తల్లి, కూతురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్థులు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## విద్వేషం, విధ్వంస విధానాలతో కాంగ్రెస్ పాలన

- వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే డైవర్షన్ పాలిటిక్స్
- ప్రజల సమస్యలు, హామీల అమలుపై సమాధానం చెప్పాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** విద్వేషం, విధ్వంస విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతోందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చర్చ జరగకుండా దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ నేతలు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని, ఆ వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం దృష్టి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతోందని పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ప్రజల సమస్యలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలపై సమాధానం చెప్పకుండా ఎన్ని రాజకీయాలు చేసినా ప్రజలను తప్పుదోవ పట్టించలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా ప్రజలు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటారని పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు.



# ఖరీఫ్ కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు

- పత్తి, ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాలపై చర్చ
- 15 మంది హమాలీలకు ట్రాక్టర్, ట్రాలీ లైసెన్సులు
- జమ్మికుంట మార్కెట్ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం



**కాకతీయ, జమ్మికుంట :** ఖరీఫ్ సీజన్‌లో పత్తి, ధాన్యం, మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నిర్ణయించింది. బుధవారం జమ్మికుంట కాటన్ మార్కెట్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జూన్, జూలై, ఆగస్టు నెలల ఆదాయ, వ్యయాలను సమీక్షించారు. ఎంఎస్పీ పరికరాలపై చర్చించారు. 15 మంది హమాలీలకు ట్రాక్టర్, ట్రాలీ లైసెన్సులు జారీకి ఆమోదం తెలిపారు. కొత్త, పాత మార్కెట్లలో సీసీ ప్లాట్‌ఫాంల మధ్య తారు పోయడం, కాంపౌండ్ వాల్, టాయిలెట్లు, గోడౌన్ రూఫ్‌ల నిర్వహణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. కొత్త మార్కెట్ కార్యాలయం ముందు సీసీ ప్లాట్‌ఫాం, పాత మార్కెట్‌లో డ్రైనేజీ ఎత్తు పెంపు, సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చించారు. మార్కెట్ కార్యదర్శి ఆర్. మల్లేశం, ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్. రాజా, వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, శ్రీపతి రెడ్డి, సునీల్, సతీష్, రాజేశ్వరరావు, సదానందం, సురేష్, దీక్షిత్, శ్రీనివాస్ రెడ్డి, రషీద్ పాషా, తిరుపతి, శ్యామ్ కుమార్, శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి

- శంకరయ్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- 24 గంటల్లో అసెంబ్లీ సాక్షిగా క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, రజక జేఏసీ కన్వీనర్ కాంబోజు వెంకటేశ్వర్లు హెచ్చరిక



**కాకతీయ, హైదరాబాద్ :** కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ రజక సంఘాల జేఏసీ కన్వీనర్ కాంబోజు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు శంకరయ్య 24 గంటల్లో అసెంబ్లీ సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే అడుగడుగునా అడ్డుకుని, ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కేసీఆర్ తెలంగాణ సాధనతో పాటు అణగారిన వర్గాలకు చేసిన సేవలను గుర్తించాలని కోరారు. ఉచిత విద్యుత్, బీసీ బంధు పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ రాజకీయ చేష్టలతో తెలంగాణ ఆత్మగౌరవానికి నష్టం జరుగుతోందన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు మేలు

- రసాయనాల వినియోగాన్ని తగ్గించాలి
- 125 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లు
- జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయభాస్కర్




**కాకతీయ, గీసుగొండ :** రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయభాస్కర్ సూచించారు. అనంతరం గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవామృతం, ఘనజీవామృతం, కషాయాలు వినియోగించడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చన్నారు. నేల సారం, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూసారం, జీవ వైవిధ్యం మెరుగుపడతాయని, నీటి వినియోగాన్ని సమర్థంగా నిర్వహించుకోవచ్చన్నారు. పత్తిలో సమగ్ర సస్యరక్షణ, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. 125 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లు పంపిణీ చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సింగం, మండల వ్యవసాయ అధికారి పి. హరీశ్ ప్రసాద్ బాబు, వ్యవసాయ విస్తరణ అధికారులు అఖిల, స్మిత, కావ్య, భరత్, ఇఫ్కో ప్రతినిధి విశాల్, ప్రజ్వల్, ఎఫ్‌పీసీఎల్ మేనేజర్ అయేషా, నూజివీడు కంపెనీ ప్రతినిధి వెంకట్, ఉపసర్పంచ్, రైతులు కృష్ణానగర్ మల్లయ్య, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం

**కాకతీయ, పెద్దవంగర :** నాటికి నేటికి సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని తహసీల్దార్ వినోద్ కుమార్ అన్నారు. ద్దవంగర మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను బుధవారం మండల విద్య వనరుల కేంద్రంలో ఎంఈవో శ్రీనివాస్ ,సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్‌లతో కలిసి ఉత్తమ ఉపాధ్యాయులు లీలా శోభారాణి, యాకయ్య, రమేష్, సురేంద్ర కుమార్,హైమ, శ్రీను,మంజుల, రవి,శ్రీనివాస్,మెహబూబు,మధుసూదన్ రెడ్డి,ప్రదీప్,కళ్యాణి,రంగయ్య లను ప్రశాంశ పత్రాలతో పాటు శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# అంతా ఈశ్వర మాయ!

- లాగిన్ నుంచి రహదారి తనిఖీల దాకా అక్రమాలు
- విధుల్లో లేని రోజున డిజిటల్ సంతకాలు
- భారీ వాహనాలకు నెలవారీ 'మామూలు'
- ఉన్నతాధికారుల మౌనం వెనుక మతలబేంటి?
- సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్



Registration Details

| | | | | | |
|---|---|---|---|---|---|
| Registration No | TS25T4338 | Class of Vehicle: | GOODS CARRIAGE | Valid Upto: | |
| FC No.: | FC/706/2026/TG037 | FC Issued by: | THAKUR ESHWAR SINGH-RTA MULUGU | FC Valid Upto: | 01/09/2028 |
| Permit No: | | Permit Issued By: | | Permit ValidUpto: | |
| Permit Type: | | | | | |
| Tax Amount: | 6110.00 | Tax Paid On: | 01/01/2026 | Tax Valid Upto: | 30/09/2026 |
| PUC No: | I | Issued by: | TG037 | Valid Upto: | 01/03/2027 |
| InsuranceCertificate No: | I | Company: | SBI GENERAL INSURANCE COMPANY LTD. | Valid Upto: | 01/09/2027 |



...ase wear a mask.
...ase maintain Physical Distancing
...ase follow the COVID-19 guidelines issued by Government / Competent Authority.
...ase Visit the RTA Office in the Time Slot booked.

TELANGANA TRANSPORT DEPARTMENT

Provisional Slot Booking Slip

Booking Date : 02/09/2026

7330332661

Dear ALLASRIDEVI,

Thanks for using Online Services of Transport Department, Government of Telangana.

Provisional booking subject to confirmation only on payment of requisite fee within 24 hours at any eseva/meseva center or you can pay online.
Failure in payment of fee with-in 24 hours, your booked slot will be cancelled.

Your Vehicle Number is TS25T4338, Application Numer is TG037/847/2026/OF .
Your slot has been booked for 02/09/2026 between 12:10 PM -- 12:20 PM.
Please report RTA MULUGU.
Failing which your slot will be cancelled.

Please bring Valid Insurance Certifficate., Pollution Certificate.

Fee Details

1. Application Fee Rs. 800.00
2. Test Fee Rs. 0
3. Smart Card Fee Rs. 0.00
4. Service Charge Rs. 300.00

OFFICE ADDRESS

MULUGU ,

991.



**కాకతీయ, ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా రవాణాశాఖ కార్యాలయం వ్యవహార శైలి ములుగు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వాహనాల రిజిస్ట్రేషన్ (ఆర్సీ), డ్రైవింగ్ లైసెన్సులు, పర్మిట్లు, ఫిట్‌నెస్ తదితర ధ్రువపత్రాల జారీ ప్రక్రియలో డిజిటల్ లాగిన్‌లు, డిజిటల్ సంతకాల వినియోగంపై ఇప్పటికే పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజాగా రహదారి తనిఖీలు, భారీ వాహనాల వ్యవహారం, కార్యాలయంలో వ్యక్తుల పాత్రపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రవాణాశాఖలో అధికారికంగా సెలవు పొందకుండా, లేదా తన బాధ్యతలను సంబంధిత ఇన్‌చార్జి అధికారికి అప్పగించకుండా ఒక అధికారి కార్యాలయ విధులకు దూరంగా ఉన్న సమయంలో ఆయన లాగిన్ ద్వారా అధికారిక ధ్రువపత్రాలు జారీ అయితే.. ఆ ప్రక్రియపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని నిపుణులు, వాహనదారులు అంటున్నారు. డిజిటల్ విధానంలో ధ్రువపత్రాల జారీ జరుగుతున్నందున సంబంధిత అధికారి లాగిన్, డిజిటల్ సంతకం ఎప్పుడు, ఎక్కడ, ఎవరి ద్వారా వినియోగించబడిందనే వివరాలు సాంకేతికంగా పరిశీలించే అవకాశం ఉంది. ములుగు జిల్లా డిటిఓ ఈశ్వర్ సింగ్ ఠాకూర్ మరో జిల్లాలో కోర్టు హాజరుకు వెళ్లిన సమయంలో ములుగు కార్యాలయంలో ఆయన లాగిన్‌తో ధ్రువపత్రాలు జారీ అయ్యాయనే ఆరోపణలు నిజమైతే ఆ సమయంలో లాగిన్‌ను ఎవరు వినియోగించారు? డిజిటల్ సంతకం ఎలా ఉపయోగించబడింది? అధికారికి దీనిపై సమాచారం ఉందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

**'లాగిన్' వ్యవహారంపై ఉన్నతాధికారుల మౌనం ఎందుకు....?**

రవాణా శాఖలో అధికారిపై ఆరోపణలు వెలువడినప్పుడు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ప్రాథమికంగా వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. లాగిన్ వివరాలు, డిజిటల్ సిగ్నేచర్ వినియోగానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులు, ధ్రువపత్రాల జారీ సమయాలు, అధికారి హాజరు రికార్డులను సరిపోల్చి చూస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు స్పష్టమైన విచారణ లేదా అధికారిక వివరణ లేకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తప్పు జరిగిందా? లేదా అన్నది తేల్చేందుకు స్వతంత్ర విచారణ ఎందుకు జరపడం లేదన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. మరోవైపు ములుగు జిల్లా పరిధిలో ఇసుక, కంకర తదితర సరుకులను తరలించే భారీ, అతి భారీ వాహనాల విషయంలో కూడా తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం జిల్లా నుండి వెళ్లే ఇసుక లారీలు ప్రతి నెలా సుమారు రూ.7,500 వరకు 'మామూలు' చెల్లిస్తే తనిఖీల సమయంలో ఇబ్బందులు ఉండవని, చెల్లించని వాహనాలపై మాత్రం వివిధ నిబంధనల కింద కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి ప్రభుత్వానికి జరిమానాల రూపంలో ఆదాయం సమకూర్చాల్సిన వ్యవస్థలోనే అక్రమ వసూళ్లకు తావిచ్చినట్లవుతుంది. తనిఖీల సమయంలోను అదనపు వసూళ్లకు పాల్పడుతున్న రవాణా శాఖ అధికారిపై కూడా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటే బాగుంటుందని జిల్లా వాసులు అభిప్రాయపడుతున్నారు.

**డిజిటల్ పేమెంట్లను నగదుగా మారుస్తున్నారా.?**

తనిఖీల సందర్భంగా లేదా నెలవారీగా వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఎదురవుతున్న మొత్తాలు డిజిటల్ పేమెంట్ల ద్వారా స్వీకరించినప్పటికీ వాటిని నగదుగా మార్చి సంబంధిత అధికారులకు చేరవేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వాహనాల తనిఖీల సందర్భంగా వాహనదారుల నుండి అప్పటికప్పుడు అధికారుల బంధు,మిత్రులకు డిజిటల్ రూపంలో వసూళ్లకు పాల్పడుతూ తర్వాత ఆ మొత్తాన్ని నగదు రూపంలోకి మార్చి సంబంధిత అధికారికి ముట్ట చెబుతున్నట్టు వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. ములుగు జిల్లా రవాణాశాఖపై వరుసగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్, రవాణాశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారి విధుల్లో లేని సమయంలో ధ్రువపత్రాలు జారీ అయ్యాయా?సంబంధిత డీటీఓ లాగిన్‌ను ఎవరు వినియోగించారు? డిజిటల్ సంతకం ఎక్కడి నుంచి వినియోగించబడింది? భారీ వాహనాలపై నెలవారీ వసూళ్లు జరుగుతున్నాయా? తనిఖీల్లో అక్రమ వసూళ్లు జరిగాయా? అనే అంశాలపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు అంటున్నారు.

**నిజమైతే కఠిన చర్యలు తప్పవా...?**

ఆరోపణలు విచారణలో నిజమని తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు అని, రవాణాశాఖలో డిజిటల్ వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది అని, ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలంటే విచారణే ఏకైక మార్గం అని, ములుగు రవాణాశాఖపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు ఇకనైనా స్పందిస్తారా? లేక 'అంతా ఈశ్వర మాయ' అంటూ మౌనం వహిస్తారా? అన్నది వేచి చూడాలి.

# తెలంగాణ వైతాళికుడు కాళోజీ

- ప్రజల హక్కుల కోసం గళమెత్తిన మహనీయుడు
- కాళోజీ సేవలను గౌరవిస్తూ తెలంగాణ భాషా దినోత్సవం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళి



**కాకతీయ,వరంగల్ బ్యూరో :** తెలంగాణ ప్రజల గొడవే తన గొడవగా జీవించిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాకవిగా, ఉద్యమకారుడిగా భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కాళోజీ తెలంగాణ వైతాళికుడిగా నిలిచారని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. నిరంకుశత్వం, అరాచక పాలనకు వ్యతిరేకంగా గళమెత్తి ప్రజల్లో చైతన్యం రగిలించారని, పలు భాషల్లో రచనలు చేస్తూ ప్రజల హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. తెలంగాణ వాడుక భాషలో రచనలను ప్రాచుర్యంలోకి తెచ్చిన కాళోజీ.. తెలంగాణ భాష బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష అని చాటారని అన్నారు. ఆయన సేవలను గౌరవిస్తూ కేసీఆర్ ప్రభుత్వం సెప్టెంబర్ 9ను తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించిందని, కాళోజీ అవార్డును నెలకొల్పడంతో పాటు వరంగల్‌లోని వైద్య విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టిందని తెలిపారు. హనుమకొండలో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. తన మరణానంతరం శరీరాన్ని కాకతీయ వైద్యశాలకు దానం చేయాలని కుటుంబ సభ్యులకు చెప్పి కాళోజీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. కాళోజీ రచనలను తెలంగాణ యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఘన నివాళులర్పిస్తున్నట్లు ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు.

# కాళోజీ సేవలు చిరస్మరణీయం

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ప్రజాకవి కాళోజీ నారాయణరావు సాహిత్యం, సేవలు చిరస్మరణీయమని జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా అన్నారు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాళోజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జోనా అన్నారు. తెలంగాణ సమాజానికి, సాహిత్య రంగానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. తన రచనలు, ఉద్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని, సామాజిక స్పృహ, మానవీయ విలువలు, ప్రజాస్వామ్య భావాలను సాహిత్యం ద్వారా చాటారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను రచనల్లో ప్రతిబింబిస్తూ అన్యాయాన్ని ప్రశ్నించిన కాళోజీ సాహిత్యం ఎప్పటికీ సజీవంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డా. రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్‌లింగం, అకౌంట్స్ అధికారి శివలింగం, సిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఎస్ఈ రాజ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, ఎంహెచ్ఓ డా. రాజేష్, హెచ్ఓ ప్రశాంత్, ఈఈలు సంతోష్‌బాబు, రవికుమార్, సంజయ్‌కుమార్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ యాసకు అక్షర గౌరవం

కాకతీయ, రుద్రంగి : తెలంగాణ భాష, యాస గొప్పతనాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు తిరుపతి సూచించారు. మానాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ కాళోజీ సాహిత్య ప్రస్థానం, ప్రజా చైతన్యానికి చేసిన కృషిని వివరించారు. అనంతరం కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మానస, గౌతమి, వాణి, ప్రియాంక, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

# 10 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

- రూ.1.17 లక్షల విలువైన నల్లబెల్లం, పటిక, గుడుంబా స్వాధీనం
- అశోక్ లేలాండ్ ట్రాలీ సీజ్.. నిందితుడు అరెస్టు
- నల్లబెల్లం అక్రమ రవాణాపై కఠిన చర్యలు

**కాకతీయ, నెల్లికుదురు :** అక్రమంగా నల్లబెల్లం, పటిక, గుడుంబాను తరలిస్తున్న నిందితుడిని అరెస్టు చేసి, రూ.1.17 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గంగారపు కరుణాకర్ తెలిపారు. మండలంలోని పార్వతమ్మగూడెం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన అశోక్ లేలాండ్ ట్రాలీని తనిఖీ చేశారు. అందులో 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 1 క్వింటా 50 కిలోల పటిక, 5 లీటర్ల గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.1.17 లక్షలుగా పోలీసులు తెలిపారు. ఇస్రా తండాకు చెందిన బానోతు శంకర్‌ను అరెస్టు చేసి, అశోక్ లేలాండ్ ట్రాలీని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. నల్లబెల్లం, పటికను అక్రమంగా విక్రయించే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రమ విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



# ప్రతి జిల్లాలో పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించాలి

- పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలి
- రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ వాణి ప్రసాద్

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** ప్రతి జిల్లాలోని పర్యాటక సామర్థ్యాన్ని గుర్తించి మూడేళ్ల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏ వాణి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పర్యాటక అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, పెట్టుబడి అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బుధవారం పర్యాటక అభివృద్ధి, జ్ఞాన భారతం మిషన్ అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి డా. సత్య శారద పాల్గొన్నారు. ప్రతి జిల్లాలో పర్యాటక కార్యక్రమాల సమన్వయానికి నోడల్ అధికారిని నియమించాలని, సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ముఖ్య పర్యాటక ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 142 వీకెండ్ గేట్‌వే ప్రాంతాల్లో మౌలిక వసతులు, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 8 జిల్లాల్లో 16 వారసత్వ ప్రదేశాల అభివృద్ధికి రూ.8.45 కోట్లతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**ప్రైవేట్ పెట్టుబడులకు బాటలు వేయాలి**

పర్యాటక ప్రాజెక్టులకు అనువైన ప్రభుత్వ భూములను గుర్తించి పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించాలని వాణి ప్రసాద్ సూచించారు. సీఎస్ఆర్ నిధులు, ప్రభుత్వ పథకాల అనుసంధానంతో వనరులు సమీకరించి తాగునీరు, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, గైడ్లు, ఫుడ్‌కోర్టుల వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. జ్ఞాన భారతం మిషన్‌లో భాగంగా చారిత్రక ప్రదేశాలు, దేవాలయాల్లోని ప్రాచీన గ్రంథాలు, మాన్యుస్క్రిప్టులను గుర్తించి డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు.



# సీట్లకు అంటుకుపోయారు!

- రెవెన్యూ విభాగంలో పాతుకుపోయిన ఆర్ఐలు
- బదిలీ నిబంధనలు నీటి మూటలేనా?
- 6 ఏళ్లుగా ఒకే స్థానంలో సురేష్
- కేసులు పెండింగ్ లో ఉన్నా చలామణి అవుతున్న మరికొందరు
- డిప్యూటేషన్ అర్ఐ వ్యవహారంపై అనుమానాలు
- కమిషనర్ వెంకన్న సార్ జోక్యం చేసుకుంటారా?






**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** నీరు ఉన్నంత సేపు కప్పలు బావిని వదలనట్లు బల్దియాలో అమ్యామ్యాలకు ఆశపడ్డ ఆర్ఐలు ఏళ్ళతరబడి అదే విభాగాన్ని వదలక పోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ విభాగంలో అక్రమాలు రోజురోజుకూ బట్టబయలవుతున్నాయి. ఇటీవల ఖాళీ స్థలాలకు సైతం ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తడంతో బల్దియా కమిషనర్ టి వెంకన్న స్వయంగా రంగంలోకి దిగి రెవెన్యూ అధికారులపై గ్రీవెన్స్ సాక్షిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లు ఉంటేనే నంబర్ ఇవ్వాలి, గూగుల్ ఫోటో అప్‌లోడ్ చేయాలి అంటూ కమిషనర్ హెచ్చరించారు. అయితే ఈ అక్రమాల వెనుక ఉన్న అసలు కారణం ఏళ్ల తరబడి ఒకే స్థానంలో తిష్ట వేసిన కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)లే అని, విస్తృతంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అయినా ఒకే చోట మూడేళ్లకు మించి కొనసాగకూడదు. ప్రతి మూడేళ్లకు తప్పనిసరిగా బదిలీ చేయాలి. ఇది అవినీతి నిరోధానికి, పారదర్శక పాలనకు ఉద్దేశించిన నిబంధన. కానీ, జిడబ్ల్యూఎంసిలో మాత్రం ఈ నిబంధన తుంగలో తొక్కినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

**నిబంధనలను బేఖాతరు చేస్తున్న ఆర్ఐలు**

బల్దియా వర్గాల నుండి అందిన సమాచారం ప్రకారం...ఆర్ఐ సురేష్ 2021 నుంచి దాదాపు 6 సంవత్సరాలు ఆర్ఐగా కొనసాగుతున్నారు. అంటే రెండు బదిలీల కాలం దాటిపోయింది. ఇంత సుదీర్ఘకాలం ఒకే చోట ఎలా ఉంటున్నారనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న.అలాగే సయ్యద్ సోహెల్ 07122022 నుంచి 3 ఏళ్లు 7 నెలలుగా అర్ఐగా కొనసాగుతున్నారు. నిబంధన ప్రకారం ఏడాది క్రితమే బదిలీ కావాలి. విశేషం ఏమంటే ఈయనపై డిసిప్లినరీ కేసు పెండింగ్ లో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. కేసు ఉన్న అధికారిని కీలక రెవెన్యూ బాధ్యతల్లో ఎలా కొనసాగిస్తున్నారని ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. జె నవనీత్, ఎస్ శ్రీకాంత్ వీరిద్దరూ కూడా 07122022 నుండే అర్ఐలుగా అదే స్థానాల్లో కొనసాగుతున్నారు. వీరి పదవీకాలం కూడా 3 ఏళ్లు 7 నెలలు దాటింది.

**వివాదాలకు కేంద్ర బిందువుగా మరో ఇద్దరు :**

ఆర్ఐ సిహెచ్ అనిల్ కుమార్ : ఈ ఆర్ ఐ మహబూబాబాద్ నుంచి డిప్యూటేషన్ పై వచ్చారు. 06112025 నుంచి జీడబ్ల్యూఎంసీలో బాధ్యతలు చేపట్టారు. సొంత కార్పొరేషన్ లో అర్హులైన సిబ్బంది ఉండగా, డిప్యూటేషన్ పై వచ్చిన వ్యక్తికి కీలకమైన అర్ఐ పోస్టు కట్టబెట్టడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ఎవరి హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అలాగే ఆర్ఐ ఏ కృష్ణారావు 04122025 నుంచి విధుల్లో కొనసాగుతున్నారు. ఈయనపై క్రిమినల్ కేసు పెండింగ్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇది నిజమైతే, అలాంటి వ్యక్తికి రెవెన్యూ బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాగా, జి నరేష్ , యం ప్రతిభ, పి అశోక్ (20082025), సమద్ (03062026), చార్లెస్ (27062026) లు కొత్తగా నియమితులయ్యారు.

**ఆరోపణల వెనుక అసలు లెక్కేంటి?**

బల్దియా రెవెన్యూ విభాగంలో ఇంటి నంబర్ల జారీ, ఆస్తి పన్ను అంచనా వంటివి అర్ఐ చేతిలోనే ఉంటాయి. ఒకే వ్యక్తి ఏళ్ల తరబడి ఒకే ఏరియాలో ఉంటే ఆ ఏరియాలోని అక్రమ నిర్మాణాలు, పన్ను ఎగవేతలపై పట్టు బిగించడం కష్టమవుతుందని, అందుకే మూడేళ్ల నిబంధన పెట్టారని అధికారులే చెబుతున్నారు. కానీ జిడబ్ల్యూఎంసిలో ఈ నిబంధనను పట్టించుకునే నాథుడే లేడనే విమర్శలున్నాయి.

పైరవీలు, పైసలు ఉంటే ఎన్నేళ్లయినా ఒకే సీట్లో ఉండొచ్చు అనేది బల్దియాలో నిరూపితమైంది. ఈ కమిషనర్ అయినా పట్టించుకుని ప్రక్షాళన చేస్తారా? లేక ఫైళ్లు తొక్కిపెడతారా? అని వేచి చూడాలని సీనియర్ ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు ఇస్తున్నారనే ఆరోపణలపై కమిషనర్ సీరియస్ అయిన తరుణంలో, ముందుగా ఏళ్ల తరబడి తిష్ట వేసిన ఈ అర్ఐలను బదిలీ చేసి, రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- నో–గో–టెల్ సూత్రాన్ని పాటించాలి
- మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలపై సమాచారం ఇవ్వాలి
- వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ




**కాకతీయ, వరంగల్ బ్యూరో :** మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు చదువు, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటాయని అన్నారు. బుధవారం మొగిలిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల అవగాహన, ఆరోగ్యం, అనారోగ్యం అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజ మాట్లాడుతూ చెడు స్నేహాలు, ఒత్తిడి, ఆసక్తితో ప్రయోగించడం, సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్‌లోని ప్రలోభాల కారణంగా డ్రగ్స్ బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎవరైనా డ్రగ్స్ అందించినప్పుడు నో-గో-టెల్ సూత్రాన్ని పాటించాలని పూజ తెలిపారు. నో అంటే డ్రగ్స్‌ను తిరస్కరించడం, గో అంటే వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవడం, టెల్ అంటే విషయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయడం అని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు గుర్తిస్తే పోలీసులకు, సంబంధిత అధికారులకు లేదా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు 15100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలు, పంపిణీ తీరును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు భైరి విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తులకు టీటీడీ బీమా కవచం

- భక్తులందరికీ ఉచితంగా బీమా సౌకర్యం
- తిరుమలలో సహజ మరణానికీ రూ.2 లక్షల సాయం
- ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంపు
- సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు
- టీటీడీ పాలకమండలి చారిత్రాత్మక నిర్ణయం

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తిరుమల యాత్రలో భక్తుల భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ టీటీడీ పాలకమండలి కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమలలో ఉన్న సమయంలో సహజ మరణం సంభవించినా భక్తుడి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించేలా ఉచిత గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించనుంది. ప్రమాదవశాత్తు మరణిస్తే ఇప్పటివరకు ఉన్న రూ.3 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచింది. బుధవారం అన్నమయ్య భవన్‌లో టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు నేతృత్వంలో జరిగిన అత్యవసర పాలకమండలి సమావేశంలో ఈ నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ద్వారా పథకాన్ని అమలు చేయనున్నారు. ఇందుకోసం టీటీడీ సొంత నిధుల నుంచి ఎల్ఐసీకి రూ.2.12 కోట్ల ప్రీమియం చెల్లించనుంది. ఉచిత సర్వదర్శనం టోకెన్లు ఉన్నవారితో పాటు ముందస్తు టికెట్లు లేకుండా వైకుంఠం క్యూలైన్ల ద్వారా వెళ్లే సామాన్య భక్తులకూ ఈ బీమా వర్తిస్తుంది.

**ప్రమాదంలో గాయపడినా ఆర్థిక సాయం**

ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి అంగవైకల్యానికి గురైన వారికి రూ.5 లక్షల వరకు, అత్యవసర వైద్య చికిత్సలకు రూ.50 వేల వరకు సాయం అందించేలా నిర్ణయించారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాలతో పాటు తిరుమలలోని భక్తులందరికీ ఈ రక్షణ వర్తించనుంది. టీటీడీలోని 48 కేటగిరీల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. రాబోయే బ్రహ్మోత్సవాల రద్దీని దృష్టిలో పెట్టుకుని 10 లక్షల శ్రీవారి లడ్డూలను బఫర్ స్టాక్‌గా ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 15 నుంచి ప్రారంభమయ్యే వార్షిక బ్రహ్మోత్సవాల నుంచే కొత్త బీమా నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

# ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్లు!

- నర్సంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అడ్డగోలు వ్యవహారం?
- 2 మండలాల్లో పంచాయతీ కార్యదర్శుల సంతకాలు ఫోర్జరీ, నకిలీ స్టాంపులు?
- ఇళ్లు, భూములు రిజిస్ట్రేషన్.. ఆపై రుణాలు
- కార్యాలయంలో పెరిగిన రైటర్ల పెత్తనం
- డీఆర్ విచారణకు ఆదేశించేనా..? ఆడిట్ జరిగేనా..?!!





**కాకతీయ, వరంగల్ బ్యూరో :** నర్సంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో పత్రాలు సృష్టించి ఇళ్లు, భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్న వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లు డివిజన్‌లోని 2 మండలాలకు చెందిన పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శుల స్టాంపులను దొంగ చాటుగా తయారు చేసి, వారి సంతకాలను పోలిన ఫోర్జరీ సంతకాలతో పత్రాలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఆ పత్రాల ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయించడంతోపాటు, అనంతరం వాటిపై రుణాలు ఇప్పించి లక్షల రూపాయలు పొందుతున్న వ్యవహారం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. నకిలీ స్టాంపులు, సంతకాలతో కూడిన పత్రాలు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి చేరుతున్నా వాటి ప్రామాణికతను అధికారులు గుర్తించకపోవడం ఎలా సాధ్యమన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

**పంచాయతీ కార్యదర్శుల స్టాంపులే నకిలీ?**

2 మండలాల్లోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శుల పేర్లతో ఉన్న స్టాంపులను పోలిన నకిలీ స్టాంపులు తయారు చేసి వినియోగిస్తున్న వ్యవహారం అత్యంత తీవ్రమైన అంశంగా మారింది. పంచాయతీల నుంచి జారీ చేసినట్లు చూపిస్తున్న ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్ పత్రాల్లోకి వస్తున్నప్పుడు వాటి వివరాలను సంబంధిత పంచాయతీ కార్యదర్శుల రికార్డులతో ఎందుకు సరిపోల్చలేదు? స్టాంపు, సంతకం నిజమైనవేనా? ధ్రువపత్రం వాస్తవంగా పంచాయతీ నుంచే జారీ అయిందా? అన్నది పరిశీలించాల్సిన బాధ్యత ఎవరిది? నకిలీ పత్రాల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరిగి ఉంటే వాటిని గుర్తించడంలో కార్యాలయ స్థాయిలో ఎక్కడ లోపం జరిగిందన్నది తేలాల్సి ఉంది.

**ఇళ్లు, భూములు రిజిస్ట్రేషన్.. ఆపై లోన్లు!**

ఫోర్జరీ పత్రాలతో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయించి, అదే పత్రాలను ఆధారంగా చేసుకుని బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందుతున్న వ్యవహారం ఉన్నట్లు సమాచారం. ఒక ఆస్తికి సంబంధించిన పత్రం నకిలీదైతే దాని ఆధారంగా రిజిస్ట్రేషన్ ఎలా పూర్తయింది? రిజిస్ట్రేషన్ తర్వాత రుణం కోసం సమర్పించినప్పుడు పత్రాల ప్రామాణికతను ఎవరు పరిశీలించారు? ఇలాంటి వ్యవహారాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయం, పంచాయతీ, రుణం మంజూరు చేసిన సంస్థల మధ్య ఉన్న పత్రాలను సరిపోల్చితే మొత్తం వ్యవహారం బయటపడే అవకాశం ఉంది. ఇప్పటికే జరిగిన అనుమానాస్పద రిజిస్ట్రేషన్లను గుర్తించి వాటిపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**సబ్‌రిజిస్ట్రార్‌కు తెలియకుండానే ఇంత తతంగమా?**

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పత్రాల పరిశీలన, ఆస్తి హక్కుల నిర్ధారణ, సంబంధిత వ్యక్తుల గుర్తింపు, బయోమెట్రిక్, ఫొటోలు, ఇతర ధ్రువీకరణలు కీలకం. అలాంటి ప్రక్రియలో ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో పత్రాలు సమర్పించి రిజిస్ట్రేషన్లు పూర్తయితే సబ్‌రిజిస్ట్రార్ స్థాయిలో పరిశీలన ఎలా జరిగింది? అధికారికి తెలియకుండానే రైటర్లు ఇంతటి వ్యవహారం నడపగలరా? తెలిసి ఉంటే ఎందుకు అడ్డుకోలేదు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల ప్రభావం పెరిగి, వారి ద్వారా వచ్చే వ్యవహారాలు సులభంగా పూర్తవుతున్నాయన్న చర్చకు ఈ పరిణామాలు మరింత బలం చేకూరుస్తున్నాయి.

**ప్రైవేట్ వ్యక్తుల హవా.. అదనపు వసూళ్లు**

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తులు ప్రజల నుంచి పత్రాలు తీసుకోవడం, పనులు చేయిస్తామని చెప్పడం, అధికారులను కలవకుండా మధ్యవర్తిత్వం చేయడం వంటి వ్యవహారాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఒక్కో పనికి రూ.100 నుంచి రూ.1,000 వరకు అదనంగా వసూలు చేస్తున్న పరిస్థితి కూడా ఉంది. ప్రభుత్వ రుసుములతో పాటు ఈ అదనపు మొత్తాలు ఎందుకు తీసుకుంటున్నారు? వాటికి రసీదులు ఇస్తున్నారా? కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తుల జోక్యాన్ని సబ్‌రిజిస్ట్రార్ ఎందుకు నియంత్రించడం లేదు? అన్నది తేలాల్సి ఉంది.

**డీఆర్ గారూ.. మీ నిఘా ఎక్కడ?**

నర్సంపేట కార్యాలయంలో ఫోర్జరీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు సమాచారం ఉన్న నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లలో పంచాయతీ కార్యదర్శుల ధ్రువపత్రాలు, స్టాంపులు, సంతకాలను ఆయా పంచాయతీ రికార్డులతో సరిపోల్చాలి. రిజిస్ట్రేషన్ సమయంలో తీసిన ఫొటోలు, బయోమెట్రిక్, వీడియో రికార్డింగ్, డాక్యుమెంట్ రైటర్ల వివరాలు పరిశీలించాలి. ఫోర్జరీ పత్రాలతో రిజిస్ట్రేషన్లు జరిగితే బాధ్యులెవరు? సబ్‌రిజిస్ట్రార్ స్థాయిలో పరిశీలన ఎందుకు విఫలమైంది? ఇంతకాలం డీఆర్, ఉన్నతాధికారుల తనిఖీల్లో ఈ వ్యవహారం ఎందుకు బయటపడలేదు? అన్న ప్రశ్నలకు సమాధానం రావాలి. నకిలీ పత్రాలతో జరిగిన రిజిస్ట్రేషన్లను గుర్తించి, వాటి వెనుక ఉన్న వ్యక్తులను బయటకు తీసి, సంబంధిత అధికారుల బాధ్యతను తేల్చాల్సిన అవసరం ఉంది.

# యూరియా ఉన్నా.. రైతులకు అందదేమీ..?

## యాప్‌లో స్టాక్ కనిపించడం లేదంటున్న రైతులు

**కాకతీయ, నల్లబెల్లి :** నల్లబెల్లి మండలంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని సొసైటీలు, ఇతర ఎరువుల దుకాణాల్లో యూరియా నిల్వలు ఉన్నప్పటికీ యాప్‌లో మాత్రం స్టాక్ అందుబాటులో ఉన్నట్లు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. గత వారం రోజులుగా మండలంలోని పలు గోదాముల్లో సుమారు 800 బస్తాల యూరియా నిల్వలు ఉన్నప్పటికీ, చుట్టుపక్కల గ్రామాల రైతులు యాప్‌లో బుక్ చేసుకునే సమయంలో ఆయా దుకాణాల పేర్లు, నిల్వల వివరాలు కనిపించడం లేదని చెబుతున్నారు. దీంతో యూరియా కోసం రైతులు ప్రతిరోజూ దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో పంటలకు సాగునీరు అందించడమే కష్టంగా మారిందని, కష్టపడి సాగు చేసిన వరి పంటకు అవసరమైన సమయంలో యూరియా అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు తెలిపారు. యూరియా కొరత పేరుతో ఏర్పడుతున్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు.

**కొత్త యాప్ ద్వారా ఎరువుల బుకింగ్**

ఈ విషయంపై మండల వ్యవసాయ అధికారి బి. రజిత మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఫెర్టిలైజర్ సేల్ యాప్‌ను ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతులు ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వర్షన్ 3.77 ద్వారా సేవలు పొందవచ్చని వివరించారు. యాప్ ద్వారా యూరియా, డీఏపీ, ఎన్‌పీకే కాంప్లెక్స్, ఎంఓపీ తదితర ఎరువులను బుక్ చేసుకోవచ్చన్నారు. రైతులు స్వయంగా యాప్‌లో బుక్ చేసుకోవడంతో పాటు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా లేదా మీసేవ కేంద్రాల్లో కూడా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. రైతులు తమ భూమి, పంట వివరాలను నమోదు చేసిన అనంతరం అర్హత మేరకు ఎరువుల పరిమాణం యాప్‌లో చూపిస్తుందని చెప్పారు. స్టాక్ ఉన్న దుకాణాల వివరాల ఆధారంగా ఎరువులను బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మ్యాపింగ్‌లో సమస్యలు, దుకాణాల పేర్లు యాప్‌లో కనిపించకపోవడం వంటి అంశాలు తమ దృష్టికి వచ్చాయని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే చర్యలు చేపడుతున్నామని వివరించారు.

# అర్హులైన లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందించాలి

- బ్యాంకర్లు, అధికారుల సమన్వయంతో రుణ లక్ష్యాలు సాధించాలి
- ముద్ర, సోలార్ యూనిట్ల రుణాల మంజూరులో వేగం పెంచాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**కాకతీయ, హనుమకొండ:** అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రుణ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లతో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలు, విద్య, గృహ నిర్మాణం తదితర రంగాలకు అందుతున్న రుణాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సమన్వయంతో పనిచేయాలని అన్నారు. చిన్నతరహా వ్యాపారాలు, పరిశ్రమలు, మహిళా స్వయం సహాయక సంఘాలకు అవసరమైన రుణాలు అందించాలని, ముద్ర రుణాలతో పాటు సోలార్ యూనిట్లకు రుణాల మంజూరును వేగవంతం చేయాలని సూచించారు. ఆర్సెటీ శిక్షణ కోర్సులను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాలని, పర్యాటక గైడ్లు, హాస్పిటాలిటీ రంగానికి సర్టిఫికెట్ కోర్సులు, శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలని అన్నారు. మడికొండలో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని మెప్మా, డీఆర్డీఏ ఆధ్వర్యంలోని మహిళా సంఘాలకు సూచించారు. తొలి త్రైమాసికంలో రూ.2939 కోట్లు, 33 శాతం రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. వార్షిక లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

# ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతకు టోకరా

- రూ.85 లక్షలు, 4 తులాల బంగారం వసూలు
- నకిలీ నియామక ఉత్తర్వులతో మోసం.. నిందితుడి అరెస్ట్
- ఉద్యోగాల పేరుతో డబ్బులు ఇవ్వొద్దన్న కాజీపేట పోలీసులు

**కాకతీయ, వరంగల్ బ్యూరో :** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పే వ్యక్తులను నమ్మి నిరుద్యోగ యువత డబ్బులు ఇవ్వొద్దని కాజీపేట పోలీసులు సూచించారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన వివరాలను సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే ధ్రువీకరించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగ యువత నుంచి భారీగా నగదు, బంగారం వసూలు చేసిన నిజామాబాద్ జిల్లాకు చెందిన మెట్టు ప్రవీణ్‌కుమార్‌ను కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌కమ్‌ట్యాక్స్ శాఖలో ట్యాక్స్ అసిస్టెంట్, ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్ ఉద్యోగాలతో పాటు స్పోర్ట్స్ కోటా, ఎన్‌సీసీ కోటా, బ్యాక్‌డోర్ రిక్రూట్‌మెంట్ పేరుతో యువతను ఆకర్షించినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల వెబ్‌సైట్లను చూపిస్తూ, గతంలో జారీ చేసిన నియామక ఉత్తర్వుల్లో పేర్లు మార్చి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, మెమోరాండంలను తయారు చేసి నమ్మించినట్లు దర్యాప్తులో గుర్తించారు. మెడికల్ టెస్టులు, పోలీస్ వెరిఫికేషన్ నిర్వహించినట్లు నటించినట్లు తెలిపారు. ఐసీఏఐలోని ఓరియంటేషన్, ఐటీ కోర్సులను ప్రభుత్వ ఉద్యోగ శిక్షణగా నమ్మించినట్లు వెల్లడించారు. బాధితుల నుంచి రూ.85 లక్షల నగదు, 4 తులాల బంగారం వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి రూ.18.22 లక్షల విలువైన వస్తువులు, డెల్ ఐ7 ల్యాప్‌టాప్, మారుతి బ్రెజ్జా కారు, రూ.2 లక్షల నగదు, ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్, ఒప్పో ఫోన్, 2 కీప్యాడ్ ఫోన్లు, అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ పత్రాలు, నకిలీ ఉత్తర్వుల తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసం వెనుక మరెవరైనా ఉన్నారా, ఇంకా ఎంతమంది బాధితులు ఉన్నారనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.




Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266